క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ


కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

కొండాపురం: మండలంలోని సత్యవోలు పంచాయతీలో ఉన్న నాగార్పమ్మ ఆలయంలో అమ్మవారికి మంగళవారం కుంకుమ పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా కొండాపురం, కొమ్మి, లింగన్నపాళెం, అగ్రహారం, కుంకువారిపాళెం, రామానుజపురం తదితర గ్రామాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో కుంకుమ పూజలో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేకాలంకరణ నడుమ ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది.

వాశిలి బాలికకు నాట్య పురస్కారం



ఆత్మకూరురూరల్: మండలంలోని వాశిలికి చెందిన సర్వేపల్లి పవన్‌కుమార్– సుమ దంపతుల కుమార్తె చాతుర్యతేజ నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో సోమవారం రాత్రి నందికేశ్వర నాట్య పురస్కారం అందుకున్నారు. పట్టణంలోని శ్రీభారతి సంగీత నృత్య విద్యాలయంలో కూచిపూడి నాట్యం నేర్చుకుంటున్న చిన్నారులు నెల్లూరు టౌన్ హాల్లో నిర్వహించిన నాట్య ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చాతుర్యతేజ ప్రదర్శనకు ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా బాలికను శిక్షణ ఇచ్చిన ఆనంద్ మంగళవారం అభినందించారు.

అలఘునాథుని కల్యాణోత్సవం రేపు

ఆత్మకూరురూరల్ : ఆత్మకూరు పట్టణంలో కొలువైన అలఘునాథస్వామి దేవస్థానంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా గురువారం రాత్రి 7 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం జరుగుతుందని ఆలయ ప్రధానార్చకుడు విశ్వనాథం శ్రీనివాసులు శాస్త్రీ మంగళవారం తెలిపారు. నూతన కల్యాణ మండపంలో రాత్రి 7 గంటలకు జరిగే కార్యక్రమంలో స్వామి, అమ్మవార్లకు విశేషాలంకారంతో పాటుగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారన్నారు. భక్తులు భారీగా తరలి రావాలని నిర్వాహకులు కోరారు.

ఈ-పంట నమోదుకు గడువు పొడిగింపు

ఉదయగిరి రూరల్: ఉదయగిరి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ఈ-పంట నమోదు చేసుకునేందుకు అక్టోబర్ 15వ తేదీ వరకు ప్రభుత్వం గడువు పొడిగించినట్లు ఇన్‌చార్జి వ్యవసాయ సహాయ సంచాలకుడు పి.చెన్నారెడ్డి మంగళవారం ఒక ప్రకటన తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలోని 2,387 ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేసి ఉన్నారన్నారు. రైతులందరూ సమీపంలోని గ్రామ వ్యవసాయ సహాయకులను కలిసి పంట నమోదు చేయించుకుని ప్రభుత్వ రాయితీ పథకాలను ఉపయోగించుకోవాలన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహకులు

ఉదయగిరి రూరల్: మండలంలోని కొండాయపాళెం పంచాయతీ వెంకట్రావుపల్లిలో నూతనంగా నిర్మించిన గంగమ్మ పోతురాజు ఆలయంలో గురువారం నుంచి శనివారం వరకు జరిగే విగ్రహ, శిఖర కలశాల ప్రతిష్ఠ మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు భారీగా తరలిరావాలని కోరారు.

పగటిపూటా వెలుగులే..


కిందికి వంగిపోయి వెలుగుతున్న వీధిదీపం

కొండాపురం: మండలంలోని 19 పంచాయతీల్లో 52 మజరా గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు ఎల్‌ఈడీ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి ఉన్నాయి. అయితే వీటిని ఆన్, ఆఫ్ చేసే ఏబీ స్విచ్‌లు చాలా గ్రామాల్లో ఏర్పాటు చేయలేదు. దీంతో ఆయా లైట్లు రాత్రి, పగలు తేడా లేకుండా వెలుగుతున్నాయి. వర్షం కురిసిన సమయంలో కొన్ని లైట్లు కాలిపోయే పరిస్థితి నెలకొంది. అంతే కాకుండా పలుచోట్ల వాటి ఏర్పాటు కూడా సక్రమంగా జరగలేదు. దీనిపై పాలకులు, పంచాయతీ అధికారులు చొరవ తీసుకుని ఏబీ స్విచ్‌లను ఏర్పాటు చేయాలని ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పాహిమాం.. రక్షమాం


ఆత్మకూరురూరల్: కాశీనాయన ఆశ్రమంలో మహిషాసురమర్దినిగా..


ఆత్మకూరురూరల్: విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో..


ఆత్మకూరురూరల్: ఉత్తర బలిజవీధిలోని జ్వాలాముఖి ఆలయంలో..

ఆత్మకూరురూరల్: పట్టణంలోని కాశీనాయన ఆశ్రమంలో కొలువైన సరస్వతీదేవి అమ్మవారు మంగళవారం మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులను కటాక్షించారు. అలాగే అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో ప్రధానార్చకుడు మేళ్లచెరువు శివకుమార్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి మహాదుర్గా అలంకారం గావించారు. అనంతరం సామూహిక లలితా సహస్రనామ కుంకుమార్చన అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా బొమ్మిరెడ్డి తారకనాథ్‌రెడ్డి– దీపిక దంపతులు వ్యవహరించారు. పట్టణంలోని ఉత్తర బలిజవీధిలో కొలువైన జ్వాలాముఖి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా నలిశెట్టి వెంకటసుబ్బారావు– లక్ష్మీ ప్రసన్న, శెట్టిపల్లి వాసుతేజ– హర్షిత దంపతులు వ్యవహరించారు.

- **ఉదయగిరి:** దసరా ఉత్సవాల్లో భాగంగా ఉదయగిరి పట్టణంలో మంగళవారం వివిధ ఆలయాల్లో అమ్మవార్లు విశేషాలంకారాల్లో దర్శనమిచ్చారు. పట్టణంలోని పార్వతి పరమేశ్వరాలయం, సంతానలక్ష్మి ఆలయం, గండిపాళెం నాగరప్పమ్మ ఆలయాల్లో అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవార్లకు విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.
- **కావలి(అల్లూరు):** నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కావలి మండలం పాతూరు గ్రామంలోని శివాలయంలో అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- **దుత్తలూరు:** నర్రవాడ పంచాయతీ గుదేవారిపాళెంలోని రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు.
- **సీతారామపురం:** శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సిద్ధేశ్వరంలోని ఇష్టకామేశ్వరి ఆలయంలో అమ్మవారు మంగళవారం దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.
- **సంగం:** సంగంలోని సంగమేశ్వరస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కామాక్షిదేవి అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.
- **కలిగిరి:** తెల్లపాడు గ్రామంలోని భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దుర్గాష్టమి సందర్భంగా ఉదయాన్నే పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో కుంకుమార్చనలో పాల్గొన్నారు. వీరపరెడ్డి లక్ష్మీరెడ్డి– వెంగమ్మ ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ధర్మకర్త జూపల్లి వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు.


ఉదయగిరి శివాలయంలో దుర్గాదేవిగా పార్వతీదేవి


కలిగిరి: దుర్గాదేవిగా భద్రకాళి అమ్మవారు


కావలి(అల్లూరు): పాతూరు శివాలయంలో..


సంగం: దుర్గాదేవిగా కామాక్షిదేవి


సీతారామపురం: దుర్గాదేవిగా ఇష్టకామేశ్వరి


దుత్తలూరు: దుర్గాదేవిగా రేణుకా ఎల్లమ్మ

కాలువ ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత


అధికారులు, పోలీసులతో మాట్లాడుతున్న మాలేపాటి రవీంద్రనాయుడు, రైతులు

దగదర్తి: దగదర్తి– రాచర్లపాడు కాలువ ఆధునికీకరణ పనుల్లో భాగంగా ఆక్రమణల తొలగింపుపై మంగళవారం ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. దగదర్తి– చెన్నూరు మధ్య డీఆర్ చానల్ పనులు ప్రస్తుతం సాగుతున్నాయి. కాలువ వెంబడి సాగు చేసుకుంటున్న రైతులు కాలువకు చెందిన కొంత భూమిని ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నారు. అదేవిధంగా రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ మాలేపాటి సుబ్బనాయుడు, టీడీపీ నేత మాలేపాటి రవీంద్రనాయుడు కాలువను ఆక్రమించారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ ప్రక్రియలో భాగంగానే ఆక్రమణ తొలగింపు చర్యలు చేపట్టారని, తమపై కక్ష సాధింపు చర్యలు చేస్తున్నారని మాలేపాటి రవీంద్ర నాయుడు, సుధాకర్ నాయుడు అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఆక్రమణల తొలగింపులో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి వివాదాలు తలెత్తకుండా మాలేపాటితో పాటు రైతులతో మాట్లాడి వివాదాన్ని సర్దుమణిగించారు. రైతుల సహకారంతో కాలువ ఆక్రమణలు తొలగిస్తున్నామని అధికారులు తెలిపారు. సుమారు 14 కిలోమీటర్ల మేర ఉన్న డీఆర్ చానల్ కాలువ పనులు వేగంగా జరుగుతున్నాయని, త్వరితగతిన పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని అధికారులు తెలియజేశారు.

అలా వదిలేశారు



వరికుంటపాడు: వరికుంటపాడు మండలంలోని తిమ్మారెడ్డిపల్లి ఎస్సీ కాలనీలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు-నేడు పథకం ద్వారా అంగన్‌వాడీ భవనం మంజూరైంది. గతంలో పనులు కూడా ప్రారంభమయ్యాయి. చివరి దశకు చేరిన క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దీని గురించి పట్టించుకోలేదు. ఈ భవనానికి సంబంధించి నిధులు మంజూరైనా పూర్తి చేసే నాథుడే లేకుండా పోయారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రైతులు లేకుండానే సొసైటీ సమావేశం


రైతులు లేకపోవడంతో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరులో సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ మహాజన్ సమావేశం మంగళవారం రైతులు లేకుండానే జరిగింది. గతంలో దీనిద్వారా నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన రైతులు రుణాలు పొందడంతో పాటుగా సహకార సంఘంలో అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకునేవారు. అయితే ఇటీవల కూటమి ప్రభుత్వం పరిటాల సత్యనారాయణ, భూమిరెడ్డి వెంకట నారాయణరెడ్డి, సుంకర పెంచల నరసయ్యలను నూతన కమిటీలో నియమించినట్లు సొసైటీ పరిధిలోని రైతులకు కూడా తెలియకపోవడం గమనార్హం. కాగా మంగళవారం నిర్వహించిన సమావేశంలో రైతులు పాల్గొనకపోగా ఖాళీ కుర్చీలు దర్శనమివ్వడం విమర్శలకు దారితీసింది. సొసైటీ ఎండీ శ్రీనివాసన్ మాట్లాడుతూ తమ సొసైటీలో నూతన సభ్యులను చేర్చుకోవటం, పాలకవర్గం ఆమోదించడం, రుణాల మంజూరు, 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు జమా ఖర్చులు, రుణాల మంజూరు తదితర అంశాలపై చర్చించామని తెలిపారు.

విధ్వంస పాలనకు గుణపాఠం తప్పదు


డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పార్టీ నేతలు

ఉదయగిరి : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విధ్వంస పాలన కొనసాగిస్తోందని, దీనికి తగిన గుణపాఠం తప్పదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొండా రాజగోపాల్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయన మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ కార్యకర్తలకు అండగా ఉండి భరోసా కల్పించేందుకు డిజిటల్ బుక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. కూటమి ప్రభుత్వంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించిన, దాడులు దౌర్జన్యాలు చేసినా ఆ వివరాలను డిజిటల్ బుక్‌లో నమోదు చేస్తే రాష్ట్రంలో మన పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇబ్బందులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటారన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. డిజిటల్ బుక్‌లో నమోదైన ప్రతి అంశానికి సమాధానం చెబుతామన్నారు. ఇలాంటి విధ్వంసకర పాలన ఏ ప్రభుత్వంలో చూడలేదన్నారు. ప్రతి ఒక్కరూ డిజిటల్ బుక్‌ను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కల్లూరి రమణారెడ్డి, దస్తగిరి అహ్మద్, షంషీర్, ఎంఎ సలీమ్, డి.సుధాకర్‌రెడ్డి, సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, నారపరెడ్డి, కె.భాస్కర్‌రెడ్డి, జి.ఓబుల్‌రెడ్డి, రమణారెడ్డి, జి.రామయ్య, పెంచలయ్య, గురవయ్య, బి.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం



ఆత్మకూరురూరల్: ఆత్మకూరు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో పలు శాఖల అధికారులతో ఆయన మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీటి సమస్యలు, ముఖ్యమైన రోడ్లు, ఇతర ప్రజా సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే మెగా డీఎస్సీలో ఎంపికైన ఆత్మకూరు వాసులకు త్వరలో ఘనంగా సత్కరించే కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.